# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారా లోకేశ్ చెప్పారు.
- ❖ అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందిస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.
- ❖ కడప జిల్లాకు విమాన కనెక్టివిటీని పెంచాలని రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడుకి విజ్ఞప్తి చేశారు.
- ❖ టీ-20 ప్రపంచ కప్‌లో భాగంగా భారత్, నమీబియా జట్ల మధ్య మరి కాసేపట్లో క్రికెట్ మ్యాచ్ ప్రారంభం కానుంది.

=================

అసెంబ్లీ సమావేశాలలో భాగంగా ఈరోజు శాసనమండలిలో ప్రతిపక్ష సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు సంబంధిత మంత్రులు సమాధానాలిచ్చారు. రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అడిగిన ప్రశ్నకు విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల కోసం ఆర్థిక శాఖకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని మంత్రి చెప్పారు. పుట్టపర్తిలో నూతన ట్రిపుల్ ఐటీ ప్రతిపాదన అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామని మంత్రి లోకేశ్ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

అర్హులైన కొంతమంది లబ్దిదారులకు పింఛన్లు అందడం లేదని విపక్ష సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దీనికి వివరణ ఇచ్చారు. అర్హులైన వారందరికీ పింఛన్లు అందిస్తున్నామని మంత్రి వెల్లడిస్తూ....

(వాయిస్ 23 సెకన్లు)

=================

బెంగళూరు నుంచి కడప వరకు కొత్త రైల్వే మార్గం ఏర్పాటు చేయాలని రాష్ట్ర రవాణా, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ను కోరారు. ఢిల్లీలో పర్యటిస్తున్న రాంప్రసాద్ రెడ్డి.. ఎంపీ డి. పురంధరేశ్వరితో కలిసి అశ్విని వైష్ణవ్ ను కలిశారు. ఈ సందర్భంగా బెంగళూరు - కడప మధ్య రైల్వే మార్గం ఏర్పాటు చేస్తే రాయలసీమ ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని అశ్విని వైష్ణవ్ కు మంత్రి వివరించగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం రాంప్రసాద్ రెడ్డి పౌర విమానయాన శాఖా మంత్రి కె. రామ్మోహన్ నాయుడును కలిసి.. కడప నుండి దేశంలోని వివిధ ప్రాంతాలకు విమానాల సేవలను పెంచాలని కోరారు. వైఎస్సార్ కడప జిల్లాకు మెరుగైన విమాన కనెక్టివిటీ కల్పిస్తే.. రాయలసీమ ప్రాంత అభివృద్ధికి, వ్యాపార, పర్యాటక రంగాల పురోగతికి దోహదపడుతుందని వివరించారు.

=================

విశాఖలో జరగనున్న ఐఎఫ్ఆర్ -2026 నిర్వహణలో భాగంగా మిగిలిన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూలో భాగంగా ఈ నెల 17 నుండి 20వ తేదీ వరకు జరగనున్న మిలాన్, ఐయాన్స్ కాన్‌క్లేవ్, సిటీ పరేడ్ తదితర కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్లపై నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీతో కలిసి ఆయన ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు ఆయా విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన చర్యల గురించి ఆరా తీశారు. రాష్ట్రపతి, రక్షణ మంత్రి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి ఇతర ప్రముఖుల పర్యటనలకు సంబంధించిన ఏర్పాట్లు, గ్రీన్ రూమ్స్, ఇతర ప్రోటోకాల్ వ్యవహారాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని, సమన్వయ లోపం రాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

=================

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రకాశం, మార్కాపురం జిల్లాలలోని 7 డిపోల నుంచి ప్రముఖ శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జి. సత్యనారాయణ తెలిపారు. ఒంగోలు ఆర్.ఎం. కార్యాలయంలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... శ్రీశైలం, కోటప్పకొండ, మొగిలిచర్ల, భైరవకోనలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. దీని కోసం 50 ప్రత్యేక సర్వీసులు సిద్ధం చేశామని, సంగమేశ్వరం, పునుగోడు, రామతీర్థంలకు కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ బస్సుల్లో కూడా స్త్రీశక్తి పథకం అమలు చేస్తామని చెప్పారు. ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే "పాకల బీచ్ ఫెస్టివల్"కు కూడా ఈ రెండు జిల్లాల నుండి ప్రత్యేక బస్సులు నడపనున్నామని సత్యనారాయణ వెల్లడించారు.

విరామం

=================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 131వ సంచిక ఈనెల 22వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 20వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=================

వ్యవసాయంలో సేంద్రియ పద్ధతులను అవలంబించడం ద్వారా రైతులకు, వినియోగదారులకు మేలు జరుగుతుందని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. తిరువూరు ఆర్‌డీవో కె.మాధురితో కలిసి ఆయన ఈరోజు రెడ్డిగూడెం మండలం, రంగాపురం గ్రామంలో పర్యటించి.. మామిడి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ

(ఎఫ్‌పీవో) లకు చెందిన అభ్యుదయ రైతులతో మాట్లాడి ఫ్రూట్ కవర్ల వినియోగం, ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... మామిడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించి రైతులు సేంద్రియ పద్ధతులను పాటించాలన్నారు.

=================

పార్వతీపురం మన్యం జిల్లా ఐటిడిఏ ఏపీవో జి. చిన్నబాబు సీతంపేట మండలం హడ్డుబంగి బాలికల ఆశ్రమ పాఠశాలను ఈరోజు సందర్శించారు. స్టోర్‌రూం, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించిన ఆయన.. పాఠశాల ప్రాంగణంతో పాటు మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రీ ఫైనల్ పరీక్షలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం అమలు చేయాలని చెప్పారు.

=================

టీ-20 ప్రపంచ కప్‌లో భాగంగా భారత్ నమీబియా జట్ల మధ్య మరి కాసేపట్లో క్రికెట్ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఢిల్లీలోని అరుణ్‌జైట్లీ స్టేడియం వేదికగా రాత్రి 7 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభమవుతుంది. అంతకుముందు శ్రీలంకలోని పల్లకెల స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఒమన్ జట్టుపై శ్రీలంక 105 పరుగుల తేడాతో విజయం సాధించింది.

=================

పీఎం శ్రీ పథకం క్రింద పశ్చిమ గోదావరి జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలలో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. పీఎం శ్రీ, ఏ డబ్ల్యు పి అండ్ బి, మనబడి మన భవిష్యత్తు పథకాల కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిపై విద్యాశాఖ, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో ఈరోజు సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పిఎం శ్రీ పథకం కింద ఎంపిక చేసిన పాఠశాల నందు అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు, దివ్యాంగులకు ప్రత్యేక మరుగుదొడ్లు, ర్యాంపుల నిర్మాణాలు, తదితర పనులు చేపట్టడానికి 104 పనులను కేటాయించడం జరిగిందన్నారు. వీటిలో 42 పనులను ఇప్పటికే పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

=================

జాతీయ నులిపురుగుల నిర్మూల కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. భీమవరంలో ఈరోజు జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 17న జిల్లాలోని 3 వేల 793 విద్యా సంస్థలు, అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలల్లోని 3 లక్షల 51 వేల 125 మందికి ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా అందించేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణ, పోషకాహార లోపాన్ని తగ్గించడాన్ని లక్ష్యంగా పెట్టుకుని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు.

=================

పార్వతీపురం మండలం అడ్డాపుశీల గ్రామంలో నూతన కోర్టు ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని జిల్లా సంయుక్త కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి ఈరోజు పరిశీలించారు. రెవెన్యూ అధికారులు స్థలానికి సంబంధించిన మ్యాప్‌లను, భూ రికార్డుల వివరాలను ఆయనకు తెలిపారు. కోర్టు భవన నిర్మాణానికి అవసరమైన భూమి లభ్యత, భౌగోళిక అనుకూలతలను క్షేత్రస్థాయిలో సమీక్షించిన జాయింట్ కలెక్టర్.. రవాణా సౌకర్యాలు, మౌలిక సదుపాయాల లభ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రతిపాదిత భూమి సర్వే నంబర్, మొత్తం విస్తీర్ణం, భూమి వర్గీకరణ, ప్రస్తుత యాజమాన్యం తదితర వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు.

=================

=================